
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



నిమ్మపండు ఛాయ.. ముఖాన బిగి నగవు.. భారతీయ విద్యాభవన్ ప్రాంగణంలో ప్రతి ఉదయం చురుగ్గా నడుస్తూ కనిపించే 80 ఏళ్ల పెద్దాయన పేరు మురళి. విద్యావేత్త. ఎస్వీ యూనివర్శిటీ పూర్వ వైస్‌ఛాన్సలర్. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లకు మేనమామ. ఈ ఆర్భాటమేదీ ఆయన మాటల్లోనూ, ప్రవర్తనలోనూ కనిపించదు. రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల్లో విశ్రాంత జీవితం గడుపుతున్నారాయన. విద్యారంగంలో అపార అనుభవం ఉన్న ప్రొఫెసర్ మురళితో ఆంధ్రజ్యోతి మార్నింగ్ వాక్ సంభాషణ..



ఎస్వీయూలో కామర్స్‌లో పీజీ పూర్తి చేసి 1969లో ఫ్యాకల్టీ మెంబర్‌గా జాయిన్ అయిన మురళి 1980లో 'ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ ఇన్ షుగర్ ఇండస్ట్రీ' అనే అంశంపై ప్రొఫెసర్ కృష్ణస్వామి నేతృత్వంలో పీహెచ్‌డీ చేశారు. ఎస్వీయూ కామర్స్ విభాగంలో తొలి డాక్టరేట్ పట్టా వీరిదే. తిరుపతిలో ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్నారు.

అమ్మ మాటలే బాటగా...

"మా సొంతూరు కడప జిల్లా రాజంపేట. అక్కడే పుట్టి, పెరిగా. అప్పట్లో రాజంపేటలో హైస్కూల్ లేదు. ఊరి పెద్దల చొరవతో నా చిన్నప్పుడే రాజంపేటకు స్కూల్ మంజూరైంది. మా తాత తొలిచందా ఇచ్చి, ఇతర దాతల సహకారంతో బడి నిర్మాణం పూర్తి చేశారు. ఊళ్లోనే బడి ఉండడంతో నా చదువు ఆటంకం లేకుండా సాగింది. పీయూసీ కోసం 1961లో తిరుపతికి వచ్చి ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ (ప్రస్తుత ఓరియంటల్ కాలేజ్)లో చదువుకున్నా. మా అమ్మ నన్ను బాగా ప్రోత్సహించేది. 'చదువుకుంటేనే విలువ' అని పదేపదే చెప్పేది. అమ్మ మాటలే చదువుపై గురి పెంచాయి. ఉన్నత చదువులకు నడిపించాయి. మా అక్క ఆ రోజుల్లోనే ఎంఏ సంస్కృతం చేసింది. అప్పట్లో ఆడపిల్ల ఎంఏ అంటే అందరూ ఆశ్చర్యపోయేవారు.

నేను టీచర్...వెంకయ్య స్టూడెంట్

21 ఏళ్లకే కామర్స్‌లో పీజీ పూర్తిచేశా. 22ఏళ్ల వయస్సులోనే నెల్లూరు వీఆర్ కాలేజ్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పుడు ముప్పవరపు వెంకయ్య నాయుడు అక్కడ బీఏ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. భారతీయ జన సంఘ్‌లో చురుగ్గా ఉండేవాడు. నా విద్యార్థి కాదుగానీ మా ఇద్దరి మధ్య ఒక బంధం ఉండేది. కలిసి మాట్లాడుకునేవాళ్లం. ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా తరుచూ మాట్లాడేవారు. ఇటీవల తిరుపతిలో జరిగిన జమిలి ఎన్నికల అవగాహన సదస్సులో కూడా మేమిద్దరం ఒకే వేదిక పంచుకున్నాం.

వర్శిటీలు డొల్లగా మారుతున్నాయి!

● ప్రభుత్వాలు పట్టించుకోవాలి ● ఎస్వీయూ మాజీ వీసీ ప్రొఫెసర్ మురళి



" సత్య నాదెళ్ల ప్రాథమిక విద్య వరకు మాకు దగ్గరగా ఉండేవాడు. చిన్నపుడు కూడా చాలా చురుకుగా ఉండేవాడు. ఇప్పటికీ అప్పుడప్పుడూ కుటుంబ విషయాల గురించి ఫోన్‌లో మాట్లాడుకుంటాం. ఒక్కోసారి సత్యా ఇండియాకు వచ్చే విషయం కూడా పత్రికల్లో చూసి తెలుసుకుంటూ ఉంటాం. అంత బిజీ."

వర్సిటీలకు నిధుల కొరత

ప్రస్తుతం విశ్వవిద్యాలయాలను నిధుల కొరత వేధిస్తోంది. సెంట్రల్ యూనివర్సిటీలు తప్ప స్టేట్ యూనివర్సిటీలన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో మన వర్సిటీలకు నిధులకు కొరత లేదు. విభజన తర్వాత నిధుల కష్టాలు మొదలయ్యాయి. దీన్ని అధిగమిస్తే తప్ప చదువులో నాణ్యత పెరగదు. ప్రభుత్వాలు పట్టించుకోవాలి. విశ్వవిద్యాలయాలు మంచి పౌరులను దేశానికి అందించగలవు. డొల్లగా మిగిలిపోతున్న యూనివర్శిటీలకు తిరిగి జవసత్వాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. అత్యంత ప్రాధాన్యాంశంగా దీనిని గుర్తించాలి.

ఆందోళనకర స్థితిలో ఎస్వీయూ

ఎస్వీయూకు క్రమంగా గ్రేడ్ తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ముఖ్యకారణం సిబ్బంది కొరత. కొన్ని విభాగాలైతే ఒకరిద్దరు ప్రొఫెసర్లతోనే నడుస్తున్నాయి. దీనివలన వర్సిటీ స్థాయి దిగజారిపోతుంది. నాణ్యమైన విద్య దూరమైపోతుండడంతో దూరవిద్య ద్వారా డిగ్రీలు తెచ్చుకుంటున్నారు. కంప్యూటర్ బేస్డ్ కోర్సులకు మాత్రమే విద్యార్థులు వర్సిటీలకు వెళుతున్నారు. పరిశోధనల సంఖ్య కనిపిస్తున్నా.. గైడ్‌ల కొరత ఉంది.

వివాదాలన్నీ వీసీ ఛాంబర్ చుట్టూ

ప్రశ్నించేవారు లేకపోతే వ్యవస్థ పనిచేయదు. అలాగని విద్యాలయాల్లో విశృంఖలత్వం పనికిరాదు. విశ్వవిద్యాలయాల్లో రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాల ఆధిపత్యం కలవరపెడుతోంది. వామపక్ష పార్టీల విద్యార్థి సంఘాలు అప్పుడూ చురుకుగా ఉండేవి. వారి సిద్ధాంతాల ప్రకారం నడిచేవి. పాలనావ్యవహారం జోలికి వచ్చేవారు కాదు. వాళ్ల సమస్యలేమైనా ఉంటే ప్రిన్సిపల్ స్థాయిలో, హాస్టల్‌లో ఏదైనా ఉంటే వార్డన్ పరిధిలో జరిగిపోయేవి. ఇప్పుడన్నీ వీసీ ఛాంబర్ చుట్టూ జరుగుతున్నాయి. ఇది మంచి పరిణామం కాదు.

ఒకసారి ఏం జరిగిందంటే..

నేను వీసీగా ఉన్నప్పటి ఒక సందర్భం గురించి చెబుతాను.. ఒకరోజు రాత్రి హాస్టల్‌లో కరెంట్ లేదు. విద్యార్థులు ప్రిన్సిపల్‌నూ, వార్డన్‌నూ అడిగితే పై అధికారుల నిర్ణయమని తోసేశారు. ఆ అసహనంతో విద్యార్థులు వీసీ ఛాంబర్‌లోకి చొరబడి పూలకుండీలు పగలగొట్టారు. కుర్చీలు విరగొట్టారు. నిజానికి జరిగింది ఏమిటంటే..సెలవులు ఇచ్చినా హాస్టల్ ఖాళీ చేయడంలేదన్న కారణంతో కరెంట్ తీసేశారు. అది కూడా ప్రిన్సిపల్, వార్డన్ పరిధిలో జరిగిన నిర్ణయం. కానీ రాజకీయ ప్రోద్బలంతో విద్యార్థులను తప్పుదారి పట్టించారు. ఇటువంటి వాతావరణం విశ్వవిద్యాలయాలను కలుషితం చేస్తున్నాయి.

వీసీగా దిగిపోయినా పార్ట్‌టైం ఫ్యాకల్టీగా..

2001 నవంబరు 7 నుంచి 2004 నవంబరు 6 దాకా ఎస్వీయూ వీసీగా పనిచేశా. వీసీగా బాధ్యతల నుంచి తప్పుకున్న తర్వాత మళ్లీ విభాగాధిపతిగా చేశా. వీసీగా చేసి మళ్లీ విభాగాధిపతిగా ఎందుకు.. రిజైన్ చేసెయ్యమని కొందరు సలహా ఇచ్చారు. నేను మాత్రం నా విభాగంలో పనిచేసి రిటైర్ అయ్యా. పదవీ విరమణ చేసిన తర్వాత కొంతకాలం పార్ట్‌టైం ఫ్యాకల్టీగా కూడా పనిచేశా. భారతీయ విద్యాభవన్ కమిటీలో సభ్యుడిగా ఉన్నా. మా అబ్బాయి అమెరికాలో స్థిరపడ్డాడు. అక్కడికి రెండేళ్లకోసారి వెళ్లి వస్తుంటాం. రోజూ ఉదయం 5 గంటలకే లేచి వ్యాయామం చేయడం, మితాహారం.. ఇవే నా ఆరోగ్య రహస్యాలు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో 4వ స్థానం



● 13,238 మందికిగాను 7,770 మంది ఉత్తీర్ణత

● ఇందులోనూ బాలికలే ముందంజ

తిరుపతి(విద్య), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు నాల్గవ స్థానంలో నిలిచారు. మే 12 నుంచి 20వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ పరీక్షలు జరిగాయి. ఇంటర్ విద్యామండలి శనివారం ఫలితాలను విడుదల చేసింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇరువురూ ఉత్తీర్ణతలో నాల్గవ స్థానంలో నిలించారు. ప్రథమ సంవత్సర పరీక్షలకు 7,985 జనరల్ విద్యార్థులు హాజరుకాగా 4,068 మంది ఉత్తీర్ణులై 51 శాతం ఉత్తీర్ణను నమోదు చేశారు. 3,917 మంది ఫెయిల్ అయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 301 మంది పరీక్షలు రాయగా 160 మంది ఉత్తీర్ణులై 53 శాతం ఉత్తీర్ణత సాధించారు. 141 మంది ఫెయిల్ అయ్యారు. ప్రథమ సంవత్సరంలో 8,286 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4,227 ఉత్తీర్ణులై 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. 4,059 మంది ఫెయిలయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4,708 మంది హాజరుకాగా 3,360 మంది పాసై 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. 1,348 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. అలాగే 244 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయగా 183 మంది పాసై 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. 61 మంది ఫెయిలయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 4,952 విద్యార్థులు హాజరుకాగా 3,543 మంది ఉత్తీర్ణులై 59 శాతం ఉత్తీర్ణత సాధించారు.

బాలికలదే పైచేయి.. : ఈ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లోనూ బాలికలు బాలురకంటే ఓ అడుగు ముందు నిలిచారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి మొత్తం 8,037 మంది పరీక్షలకు హాజరుకాగా 4,671 మంది పాసై 58.12 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక బాలికల్లో 5,201 మంది పరీక్షలు రాయగా 3,099 మంది పాసై 59.58 శాతం ఉత్తీర్ణత పొంది తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారని ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

కిలో రూ.12 లెక్కన

నేటినుంచి తోతాపురి కొనుగోళ్లు



తిరుపతి (కలెక్టరేట్), జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): రాయలసీమ మామిడి రైతులకు సీఎం చంద్రబాబు తీపి కబురందించారు. తోతాపురి మామిడి కాయలను కిలో రూ.12 లెక్కన ఆదివారం నుంచే కొనుగోలు చేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి రాజమౌళి శనివారం రాత్రి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్‌కుమార్, శ్రీధర్‌లతో తోతాపురి మామిడి కొనుగోళ్లపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4.50లక్షల టన్నుల తోతాపురి దిగుబడి ఉంది. సీజన్ ప్రారంభమైనా అటు వ్యాపారులు కానీ, ఇటు మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం కానీ తోతాపురిని కొనుగోలు చేయకపోవడంతో మామిడి రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది.బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.4 కూడా పలక్కడంతో మామిడి రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆదివారం నుంచి తోతాపురి మామిడి క్రయవిక్రయాలు యుద్ధప్రాతిపదికన జరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. మామిడి గుజ్జు పరిశ్రమలు కిలో మామిడికి రూ.8 చెల్లించనుండగా, ప్రభుత్వం రూ.4 మేర సబ్సిడీ రూపేణా చెల్లించనుంది. ఇందువల్ల ప్రభుత్వంపై రూ.160కోట్ల దాకా భారం పడనుందని అంచనా. ప్రభుత్వం నుంచి రూ.4 అదనంగా వస్తుండటంతో నేటినుంచి మామిడిపల్ప్ యూనిట్లు కూడా రైతుల నుంచి కాయలు కొనుగోలు చేయనున్నాయి.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

● ప్రసన్న వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వడమాలపేట,జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.30 నుంచి 8.00 గంటల నడుమ మిథున లగ్నం లో వైఖానస ఆగమోక్తంగా కంకణ భట్టాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజారోహణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం మాడవీధుల్లో తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి ధ్వజస్తంభం ఎగుర వేశారు. ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణం నిర్వహించారు.అనంతరం ఉభయనాంచారులతో శ్రీవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ అనంతరం పెద్ద శేషవాహనం పై దేవేరుల సమా శ్రీనివాసుడిని అధిరోహింప జేసి సంపూర్ణ అలంకరణతో మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణభట్టార్ తిపయ్యఆచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

వాహనాల బహూకరణ

తిరుపతికి చెందిన మాధవరావు రూ.6.50 లక్షలతో సూర్య, చంద్రప్రభ వాహనాలను, రైల్వే కోడూరుకు చెందిన మురళి రూ.5 లక్షలతో గజవాహనాలను అధికారులకు అందజేశారు. దాతలకు దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయా వాహన సేవ రోజుల్లో దాతలకు ప్రాతినిథ్యం కల్పిస్తున్నట్లు అధికారులు చెప్పారు.



పెద్దశేష వాహనంపై దేవేరులతో శ్రీవారు

ప్రాణం తీసిన ఈత సరదా

● ఇద్దరు చిన్నారుల మృతి
● తల్లి చూస్తుండగానే మృత్యు ఒడిలోకి కుమార్తె

పెళ్లకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణం తీసింది. మండలంలోని కలవకూరు సమీపంలో స్వర్ణముఖి నది డ్యామ్ వద్ద శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. శ్రీకాళహస్తి బహుదూర్‌పేట ముత్తరాశి కాలనీకి చెందిన బచ్చల జ్యోతి, ఆమె తల్లి లక్ష్మి, తమ్ముడు కుమార్, కుమార్తె నందిని (9)తోపాటు బహుదూరుపేట, సాలిపేటకు చెందిన మరో ఐదుగురు పిల్లలను తీసుకుని ఆటోలో కలవకూరు సమీపంలోని కాజ్‌వే వద్దకు చేరుకున్నారు. కలవకూరులో జ్యోతికి సమీప బంధువులు ఉండటంతో తరచూ వస్తూపోతూ ఉంటారు. శనివారం కూడా బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో నదిలోని నీటిగుంటలో ఆరుగురు పిల్లలు సరదాగా ఈత కొడుతూ గడిపారు. కొంతసేపటికి జ్యోతి కుమార్తె నందిని, మరో చిన్నారి లికిత్ (14) నీటిలో మునిగిపోతూ కేకలు వేశారు. మిగిలిన నలుగురు పిల్లలు ఒడ్డుకు చేరుకుని కేకలు వేయడంతో కొంత దూరంలో ఉన్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని నీటి గుంటలో గాలించారు. ఇద్దరు చిన్నారులను వెలికితీసి వారు వచ్చిన ఆటోలోనే శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కన్న కుమార్తె కళ్లెదుటే నీట మునిగి మృతి చెందటంతో తల్లి జ్యోతి కన్నీరుమున్నీరుగా విలపించింది. పెళ్లకూరు ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో శ్రీకాళహస్తికి వెళ్లి వివరాలు సేకరించారు.



మృతి చెందిన నందిని, లికిత్

భక్తిశ్రద్ధలతో బక్రీద్



తిరుపతి యూనివర్సిటీ రోడ్డులోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హాజీలు మాట్లాడుతూ తోటివారిని ప్రేమించాలన్నారు. ఖురాన్‌ను ప్రతి ఒక్కరూ పఠించడం ద్వారా సన్మార్గంలో నడవగలుగుతారని, తద్వారా అల్లా ఆశీస్సులు పొందగలుగుతారని పేర్కొన్నారు. బక్రీద్‌ను త్యాగానికి ప్రతీకని గుర్తెరిగి పరస్పరం సాయం అందించుకోవాలన్నారు.



చంద్రగిరి

ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రామచంద్రాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఆధునిక వ్యవసాయ యాజమాన్య పద్ధతులను అలవరచుకుని సాగు చేస్తే అధిక లాభాలను పొందవచ్చని ఐసీఏఆర్ శాస్త్రవేత్త భరత్‌కుమార్ అన్నారు. మిట్టూరు కమ్యూనిటీ హాల్‌లో శనివారం కమ్మకండ్రిగలో రైతులకు రాస్ కేవీకే ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూన్న ఖరీఫ్ సీజన్‌లో అదిక దిగుబడినిచ్చే ప్రధాన పంటలను సాగు చేసి, యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ఆర్ఎఆర్ఎస్ వ్యవసాయాధికారి మహేశ్వర్‌రెడ్డి, భసార పరీక్షల ప్రాముఖ్యత, ప్రభుత్వ రాయితీలపై అవగాహన కల్పించారు. రాస్ కృషి విజ్ఞానకేంద్రం పశు వైద్యశాస్త్రవేత్త అనూష మాట్లాడుతూ పాడి,వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన కోళ్ల, గొర్రెలు, పట్టుగొడుగుల, చేపల పెంపకం లాంటివి చేపడితే ప్రభుత్వమే ఆర్థిక సహకారం అందజేస్తుందన్నారు. వ్యవసాయాధికారి వేణుగోపాల్ ప్రకృతి వ్యవసాయం,డ్రోన్‌ల వినియోగం గురించి వివరించారు.

షైనింగ్ స్టార్లుగా విద్యార్థుల ఎంపిక



గీతిక - సుశాంత్- రెడ్డివిహారిక

పాకాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి షైనింగ్ స్టార్ అవార్డులకు స్థానిక ఇన్‌ఫెంట్ జీసస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందజేసే అవార్డులకు పాఠశాలలోని ఎస్.గీతిక (592), సుశాంత్ (582), కె.రెడ్డివిహారిక (579)లు ఎంపిక కావడంపై పాఠశాల కరెస్పాండెంట్ ఫాదర్ వై. అంతోనిరాజ్, ప్రదానోపాధ్యాయులు రెడ్డిలత, ఎవిఇ షకీల, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు



రెడ్డి చంద్రిక - రిత్విక శ్రీసాయి

భాకరాపేట: భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గిరికుమార్ రెడ్డి తెలిపారు. గత మార్చిలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో పాఠశాలకు చెందిన రెడ్డి చంద్రిక 575/600, రిత్విక శ్రీసాయి 568/600మార్కులు సాధించి ప్రతిభ చూపారన్నారు. వీరిని హెచ్ఎం స్వాతి, ఉపాధ్యాయులు అభినందించారు.

త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్




భాకరాపేట ఈద్గా మైదానంలో ప్రార్థనలు

భాకరాపేట, జూన్ 7(ఆంధ్ర జ్యోతి): త్యాగం, కరుణకు ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భగా చిన్నగొట్టిగల్లు మండలంలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. శనివారం ఉదయం ఈద్గాహ మైదానంలో ప్రార్థన నిర్వహించారు. మత గురువులు మహమ్మద్ ప్రవక్త బోధనలు బోధించారు. ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహార వితరణ చేశారు. కార్యక్రమంలో ముతవల్లి షాజహాన్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

భాకరాపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనాల కోసం రైతు సేవ కేంద్రాలలో ఈ నెల 9 నుంచి పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి రైతులకు సూచించారు. రైతులు 1బీ, ఆధార్, మొబైల్ ఫోను తీసుకెళ్లాలన్నారు. జనుము, జీలగ విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు మండలానికి 720 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు, 82 క్వింటాళ్ల జనుము, 5 క్వింటాళ్ల జీలగ విత్తనాలు వచ్చాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాల నంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. మాడ వీధుల్లో ఊరేగుతూ దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, ఇన్‌స్పెక్టర్లు, అర్చకులు భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల అంగడిలో చోరీ

చంద్రగిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఓకూరగాయల దుకాణంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు పాతపేటకు చెందిన సురేష్‌రెడ్డి కూరగాయల దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. శనివారం దుకాణానికి కట్టిన పట్టను తొలగించి ఉంది. ఐదు మూటలు తెల్లగడ్డలు, రెండు బ్యాగుల ఎర్రగడ్డలు, త్రాసు, కొంత నగదు తీసుకుపోయాయరని బాధితుడు సురేష్‌రెడ్డి పోలీసులకు తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలించిగా ఇద్దరు దుండగుటు చోరీ చేసినట్లు గుర్తించారు. గతంలో ఇదే దుకాణంలో చోరీ జరిగింది.

గోతిలో పడి ఆవు మృతి

● స్తంభం కోసం గొయ్యి తవ్వి వదిలేసిన ఫలితం



చంద్రగిరి, జూన్ 7(ఆంధ్ర జ్యోతి): గోతిలో పడి ఆవు మృతి చెందింది. బాధితుడు ఆనందకుమార్ కథనం మేరకు పనపాకం పంచాయతీలోని ఇరివి శెట్టివారిపల్లెలో గతంలో విద్యుత్ సిబ్బంది 11 కేవీ లైన్ విద్యుత్ స్తంభం కోసం పెద్ద గొయ్యి తవ్వి వదిలేసారు. తర్వాత ఏపుగా చిన్నచిన్న మొక్కలు పెరిగాయి. ఈక్రమంలో శనివారం అటుగా వెళ్లిన పాడిఆవు ఆ గోతిలో పడిపోంది. స్థానికులు ఆవు అరుపులకు స్పందించి బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అప్పటికే తీవ్ర గాయాలపాలై గోతిలోనే మృతి చెందింది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వలనే సుమారు రూ.1.50 లక్షల రూపాయల విలువై ఆవు మృతి చెందిందని బాధితుడు వాపోతున్నాడు.

వెబ్ కౌన్సెలింగ్ వద్దంటూ టీచర్ల నిరసన

చంద్రగిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వెబ్ కౌన్సిలింగ్ వద్దంటూ శనివారం చంద్రగిరిలోని ఎఆర్సీ భవనం వద్ద ఉపాధ్యాయ సంఘాలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు మాట్లాడుతూ గత నెల 19న ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ జరుపుతామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం వెబ్ కౌన్సిలింగ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తోందన్నారు. ఒక్కొక్క సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు వెయ్యికిపైగా ఆప్షన్లు ఇవ్వడం ఆచరణ సాధ్యంకాదన్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ జరపాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రెడ్డిప్రసాద్, వెంటేశ్వర్‌రెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, రామిరెడ్డి, మోహన్, ప్రసన్నకుమార్, చెంచయ్య, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

9, 12 తేదీల్లో పలు రైళ్ల రద్దు

తడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ - గూడూరు సెక్షన్ కవర పేట - గుమ్మిడిపూండి మార్గంలో మరమ్మతుల కారణంగా ఈ నెల 9, 12 తేదీల్లో పలు రైల్లు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్ - గుమ్మిడిపూండి, చెన్నై బీచ్ - గుమ్మిడిపూండి, చెన్నై సెంట్రల్ - సూళ్లూరుపేట, సూళ్లూరుపేట - నెల్లూరు, నెల్లూరు - సూళ్లూరుపేట మధ్య 9, 12 తేదీల్లో ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 3.20 గంటల వరకు పలు సబర్బన్ రైళ్ల రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

రద్దు చేసిన రైళ్ల వివరాలు....

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037.
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.45 నిమిషాలకు వచ్చే మెమూ రైలు నెంబరు 66038.
- చెన్నై నుంచి సూళ్లూరుపేట ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు బయలుదేరే ఈఎంయూ లోకల్ రైళ్ల.
- సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్ల.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.40, 10.30, 11.35, 12.40లకు బయలుదేరి వచ్చే ఈఎంయూ రైళ్ల.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 10.55 మధ్యాహ్నం 1.05 గంటలకు, 2.30, 3.15 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్ల రద్దు అయ్యాయి. మరికొన్ని రైళ్ల పాక్షికంగా రద్దు చేశారు.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు



ఆలయం వెలుపల భక్తుల రద్దీ

ఐరాల(కాణిపాకం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి శనివారం నాలుగు గంటల సమయం పట్టింది. ఆలయం, పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచే వేలాదిగా తరలిరావడంతో క్యూలైన్లు ఆలయం వెలుపలకు వ్యాపించాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా సిబ్బందితో కలిసి ఈవో పెంచలకిషోర్ తగిన చర్యలు తీసుకున్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.2,00,232 విరాళం



ఐరాల(కాణిపాకం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణట్రస్టుకు విజయవాడకు చెందిన మల్లికార్జున, చిత్తూరు కొంగారెడ్డిపల్లెకు చెందిన చంద్రన్‌లు ఒక్కొక్కరు రూ.1,00,116 చొప్పున రూ.2,00232లను శనివారం వేర్వేరుగా విరాళమిచ్చారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లను చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



మృతి చెందిన మణి

నాయుడుపేట టౌన్, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): నాయుడుపేట - నరసారెడ్డి కండ్రిగ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి మణి (25) అనే యువకుడు మృతి చెందాడు. చిట్టమూరు మండలం గునపాడు గ్రామానికి చెందిన మణి పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేసేవాడు. శనివారం సాయంత్రం దుకాణంలో పనులు ముగించుకొని మోటారు సైకిల్‌పై స్వగ్రామమైన గున పాడుకు బయలుదేరాడు. నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో వెళ్తుండగా మోటారు సైకిల్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మణి అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

నాయుడుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్ఐ మాలకొండయ్య తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్ల ఉంటుందని, రైల్లో నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉండవచ్చ న్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగేళ్లయినా మొండిగోడలకే పరిమితం



నిలిచిన సచివాలయం-2 భవన నిర్మాణం

పాకాల, జూన్ 7:(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయం-2 భవన నిర్మాణాన్ని నాలుగేళ్ల క్రితం అట్టహాసంగా ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. గాంధీనగర్, శ్రీనివాసనగర్, కరీంతుల్లాబాద్, బాలాజీ కాలనీ, గుట్టకింద ఇండ్లు, రెల్వేకాలనీ పరిసర ప్రాంతాల కోసం గాంధీనగర్ సమీపంలో ఈ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.40 లక్షల వ్యయంతో రెండతస్థుల భవనం నిర్మించాలని పనులు మొదలుపెట్టారు. మొదటి అంతస్తు పూర్తి చేశారు. ఆపై గోడలు కట్టి నిలిపివేశారు. కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్, వైరింగ్ కింది అంతస్తు పెండింగులోనే వుంది. అసంపూర్తిగా మిగిలిన భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. రెండేళ్ల నుంచి పనులు జరగకపోవడంతో నిర్మాణం శిథిలావస్థకు చేరుకుంటోంది. సుమారు 900కు పైగా కుటుంబాలకు ఈ భవనం ఉపయోగంగా వుంటుంది. సచివాలయం ప్రారంభం నుంచి చిన్న అద్దెభవనంలో అరకొదర వసతుల మధ్య నడుస్తోంది. ఇప్పటికే సుమారు రూ.25 లక్షలకు పైగా వెచ్చించారు. అధికారులుచొరవ తీసుకొని భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సూళ్లూరు పేట కాదు..సూరీడుపేట

● నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఎండలు

● జూన్ ఆరంభంలోనూ వేడెక్కిన వాతావరణం



షార్ బస్టాండు వద్ద నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

సూళ్లూరుపేట, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): గడిచిన వారం రోజుల నుంచి ఎండలు రోహిణి కార్తెను గుర్తు చేస్తున్నాయి. సూర్యోదయం నుంచే భానుడు భగభగ మంటున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతతో ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. మే నెలలో రుతుపవనాలు ప్రవేశించడంతో కురిసిన వర్షాలకు చల్లబడిన వాతావరణం జూన్ మొదటి వారంలో ఒక్కసారిగా వేడెక్కింది. సూళ్లూరుపేటలో శనివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజుల నుంచి భానుడు భగభగ మంటుండడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి. రాత్రివేళల్లో కూడా ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది ముందుగానే తొలకరి వానలు పలకరించాయి. అయితే అనూహ్యంగా మళ్లీ ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. అధిక ఉష్ణోగ్రతకు తోడు వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో బయ టకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం 12 గంటలకే పట్టణంలో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. రాత్రి సమయాల్లో కూడా వేడిగాలులు తగ్గడం లేదు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



రేణిగుంట, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి) : అక్రమ ఇసుక రవాణాను గ్రామ స్తులతో కలిసి జన సైనికులు అడ్డుకు న్నారు. శనివారం గాజులమండ్యం హరిజనవాడ సమీపంలో స్వర్ణముఖి నది తీరాన ఇసుక అక్రమ రవాణాకు పాల్పడు తుండగా జనసేన నాయ కులు గ్రామస్తులతో కలిసి అడ్డుకు న్నారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు నాగరాజు మా ట్లాడుతూ... స్వర్ణముఖి నది పరి వాహక ప్రాంతాల్లో ఇసుకను అధిక మొత్తంలో తోడేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. ఇప్పటికైనా ఇసుక స్మగ్లర్లపై దృష్టి కేంద్రీకరించి చట్ట పరమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు బోయకొండలో 2వేల మందితో యోగాంధ్ర

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలం బోయకొండ గంగమ్మ ఆలయ గాలిగోపురం సమీపంలో సోమవారం రెండువేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, వివిధశాఖల అధికారులు, ఆయుష్ నోడల్ అధికారులతో శనివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల్లో యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇదివరకే కాణిపాకం, పులిగుండులో యోగాంధ్ర కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. సోమవారం బోయకొండ వద్ద ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. పరిసర మండలస్థాయి అధికారులందరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

టీడీపీ నేతపై వైసీపీ నేతల దాడి

● జెండా తొలగింపుతో మొదలైన వివాదం



ఎస్టీవీ నగర్‌లో టీడీపీ జెండా తొలగించి వైసీపీ జెండా ఏర్పాటు చేసిన వైనం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్ర జ్యోతి): ఎస్టీవీ నగర్‌లో టీడీపీ జెండా తొలగించడంతోపాటు ఆ పార్టీకి చెందిన వ్యక్తిపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... ఎస్టీవీ నగర్‌లో టీడీపీ నాయకులు గ్రామంలో కొన్ని నెలల క్రితం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. వైసీపీ నాయకుడు ఇరగం రవి, అనితలు శుక్రవారం అర్ధరాత్రి ఆ జెండాను తొలగించారు. అదే ప్రాంతంలో వైసీపీ జెండాను ఎగురవేసి కవ్వింపు చర్యలకు దిగారు. తమ పార్టీ జెండా స్థలంలో వైసీపీ జెండా ఉంచడంపై టీడీపీ సీనియర్ నాయకుడు రవి వైసీపీ నాయకుడు ఇరగం రవిని ప్రశ్నించారు. దీంతో అతనితోపాటు అనిత, శివారెడ్డి, వసంత, సాయిలు కలిసి రవిపై దాడి చేశారు. ఘటనలో రవికి తలపైన, చేతులపైన బలమైన గాయాలయ్యాయి. రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ అలజడులతో శాంతికి భంగం కలిగించారని నిందితులు రవి, ఇరగం అనిత, శివారెడ్డి, వసంత, సాయిలపై ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వర స్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

దుర్గిపేరి వద్ద ఎదురెదురుగా కార్ల ఢీ



ఏర్పేడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరి వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏర్పేడు నుంచి వెంకటగిరివైపు వెళుతున్న కారులో ప్రయాణి స్తున్న రాపూరు మండలం అక్కమాంబ పురానికి చెందిన రాగమ్మ, లక్ష్మమ్మ, రాఘ వయ్య గాయపడ్డారు. అదే విధంగా వెంకట గిరి నుంచి ఏర్పేడు వైపు వెళుతున్న కారుతో ప్రయాణి స్తున్న హాస్య తలకు గాయమైంది. వారిని 108 అంబులెన్స్‌లో వెంకటగిరి ప్రభు త్వాస్పత్రికి తరలించారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

రేపు నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ యూనిట్ల ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 7(ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లను ప్రారంభించనున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, నగరి నియోజకవర్గం సంబంధిత అధికారులు తమ నియోజకవర్గానికి సంబంధించిన విజన్ డాక్యుమెంట్-2047 పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. సంబంధిత నియోజకవకర్గ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిదులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, అధికారులు హాజరుకావాలని తెలిపారు. జిల్లా ప్రధాన కేంద్రం నుంచి ఇన్‌చార్జి మంత్రి అన గాని సత్యప్రసాద్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.





భక్తులకు కళా విందు





తిరుపతి నగరంలో గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం స్వామి ఉదయం హనుమంత,రాత్రి గజరాజ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వాహనసేవ సందర్భంగా ప్రదర్శించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ కళారీతులు భక్తులకు ఆధ్మాతికానందాన్ని పంచాయి. ప్రత్యేక వేషధారణలు అలరించాయి.

మహిళలను కించపరిచే సంస్కృతి వైసీపీది



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ, కుమారమ్మ తదితరులు

తిరుపతి(జీవకోన), జూన్ 7(ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచే సంస్కృతి వైసీపీది అని టీడీపీ చిత్తూరు జిల్లా పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు అరుణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజధాని అమరావతిని సుందరంగా తీర్చిదిద్ది, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు సంకల్పంపై బురద జల్లడానికి వైసీపీ శ్రేణులు కుట్ర పన్నాయన్నారు. జగన్‌కు చెందిన సాక్షి చానల్‌లో జరిగిన ఓ చర్చలో కృష్ణంరాజు పాత్రికేయుడు అమరావతి చుట్టుపక్క ప్రాంతాల వారు సెక్స్ రాకెట్లు నడుపుతున్నారని వ్యాఖ్యానించడం గర్హనీయ మన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఎంతోమంది మహిళలు స్వచ్ఛందంగా తమ భూములు ఇచ్చారని గుర్తుచేశారు. భావి తరాల కోసం త్యాగం చేసిన మహిళలను వైసీపీ అవమానించడం తగదన్నారు. 11 సీట్లతో గుణపాఠం చెప్పినా వైసీపీ తన తీరు మార్చుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మహిళా కార్యదర్శి కడియాల భారతి, ఉపాధ్య క్షురాలు సరోజనమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బాల క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు విజయ్‌కుమార్, డాక్టర్ సతీష్‌కుమార్

తిరుపతి(క్రీడలు), జూన్ 7(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సీడీసీఏ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్ అన్నారు. ఫ్రెండ్లీ ఫైటర్స్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించి సమ్మర్ కోచింగ్ క్యాంపు శనివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చిన్నవయస్సులోనే క్రికెట్‌లో రాణిస్తే అండర్-12 నుంచే రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అకాశం లభిస్తుందన్నారు. అలాగే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ప్రముఖ గ్యాస్ట్రాలజిస్ట్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులకు మంచి పౌష్టికాహారం, తగిన వ్యాయామం అవసరమన్నారు. కాగా సమ్మర్ క్యాంపులో 150మంది క్రికెట్ శిక్షణ తీసుకున్నారు. పది జట్లుగా ఏర్పాటుచేసి ఒక టోర్నీ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లలో సెంచరీ చేసిన, 6వికెట్లు తీసి ప్రతిభచాటిన క్రీడాకారులున్నారు. అతిథులచే సర్టిఫికెట్స్, మెడల్స్, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీఏ జాయింట్ సెక్రటరీ సతీష్‌కుమార్‌యాదవ్, వెంకటరమణ, ప్రకాష్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కృష్ణంరాజును అరెస్టు చేయాలి: టీడీపీ

తిరుపతి, జూన్6(ఆంధ్రజ్యోతి): అమరావతిని వేశ్యల రాజధానిగా పేర్కొన్న జర్నలిస్ట్ కృష్ణంరాజును తక్షణం అరెస్టు చేయాలని తిరుపతి నగరపాలక డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఐదేళ్లపాటు మూడు రాజధానుల పేరుతో డ్రామాలాడి రాష్ట్రానికి రాజధాని లేకుండా మాజీ సీఎం జగన్ వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారం కోల్పోయినా అమరావతిపై విషం కక్కుతూనే ఉన్నారని మండిపడ్డారు. సాక్షి ద్వారా అమరావతిపైన, భూములు ఇచ్చిన రైతుల పైన అక్కసు వెళ్లగక్కుతూ దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాజధాని ప్రాంత మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచినందుకు బాధ్యత వహిస్తూ వైఎస్ జగన్ క్షమాపణ చెప్పాలని కోరారు.

ఉత్సవర్లకు వాహనాల బహూకరణ



గజవాహనం అందజేస్తున్న దాతకు సన్మానం

వడమాలపేట,జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన మాధవరావు రూ.6.50 లక్షలతో సూర్య, చంద్రప్రభ వాహనాలను, రైల్వే కోడూరుకు చెందిన మురళి రూ.5 లక్షలతో గజవాహనాలను అధికారులకు అందజేశారు. దాతలను సన్మానించారు.

ఈశానేశ్వర నవలింగాల సేవలో సుమ, రాజీవ్ కనకాల దంపతులు



శివున్ని దర్శించుకుంటున్న సినీనటులు రాజీవ్‌కనకాల, సుమ దంపతులు

తిరుపతి అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్‌లో కొలువైన ఈశానేశ్వర నవలింగాల సేవలో సినీ నటులు రాజీవ్‌కనకాల, యాంకర్ సుమ దంపతులు తరించారు. శనివారం వారు ఆలయానికి విచ్చేశారు. స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు ప్రసాదం స్వీకరించారు. అర్చకుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేషాచలం పాదాల చెంత పచ్చని ప్రకృతిలో కొలువుదీరిన ఈ ఆలయానికి మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏకబిల్వం, మహాబిల్వం, రుద్రాక్షలు, నాగలింగం, జమ్మి, ఉసిరి వంటి వృక్షాలు పదుల సంఖ్యలో పెరుగుతుండటం పరమేశ్వరుని కృప అన్నారు.

22ఏ నుంచి తాతానగర్ వాసులకు ఊరట

నగరంలో దశలవారీగా విముక్తి కల్పిస్తాం ● కృతజ్ఞతా సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



కృతజ్ఞతా సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ తదితర నాయకులను సత్కరిస్తున్న తాతానగర్ నాయకులు

తిరుపతి, జూన్7(ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షసాధింపులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాలను 22ఏ (నిషేధిత జాబితా) కింద వైసీపీ నాయకులు చేర్చారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. శనివారం తాతయ్యగుంట గంగమ్మగుడి ప్రాంతంలో తాతానగర్ వాసుల కృతజ్ఞతా సమావేశం జరిగింది. ఇందులో తాతానగర్ వాసులకు ప్రొసీడింగ్స్ కాపీలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనంబర్ 40, 48ను సబ్‌డివిజన్ చేసి 70సెంట్ల భూమిలో గంగమ్మగుడికి చెందిన భూమి కొంత ఉందని, మిగిలిన దానిని 22ఏ నుంచి తాతానగర్ వాసులకు విముక్తి కల్పించామన్నారు. ఈ ప్రొసీడింగ్స్ త్వరగా రావడంలో పులుగోరు మురళి, భరణి యాదవ్‌ల కృషి అభినందనీయమని అన్నారు. రాజకీయ లబ్ధికోసం మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నగరంలోని పలు ప్రాంతాలను 22ఏ కింద చేర్చారన్నారు. ఆ ప్రాంతాలన్నింటికీ 22ఏ నుంచి విముక్తి కల్పిస్తామని తెలిపారు. తనను గెలిపించిన ప్రజల సమస్యల పరిష్కరించి వారి రుణం తీర్చుకుంటానని చెప్పారు. పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు ప్రజలు అండ గా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, నరసింహులునాయుడు, మహేష్ యాదవ్, రాజారెడ్డి, సూరా సుధాకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హేమంత్‌కుమార్ యాదవ్, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెద్దలపై అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ నాయకుడిపై చర్య తీసుకోండి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ నాయకుడు పసుపులేటి సురేష్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర అధికారప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు శనివారం ఎస్పీ హర్షవర్ధన్ రాజును కలిసి అందుకు సంబంధించిన ఆధారాలతో ఫిర్యాదు చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్‌లు ప్రజాస్వామ్య ద్రోహులుగా చిత్రీకరిస్తూ ఓ విద్యార్థిని హత్య చేస్తున్నట్టు పోస్టులు సృష్టించి సోషల్ మీడియాలో సురేష్ వైరల్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తున్న కంకణాల రజనీకాంత్

తిరుమలలో రద్దీ



వేసవి సెలవు ముగింపు,వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శనివారం ఆలయం పరిసరాలతో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో సందడి నెలకొంది.

రేపటి సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ



మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్)జూన్7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కందారపు మురళి, ప్రసాదరావు పిలుపునిచ్చారు. తిరుపతి సీఐటీయూ కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులు, కార్య కర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్పొరేటర్లకు అనుకూలంగా మార్పులు చేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ సమ్మె చేపట్టనున్నాయని వివరించారు. ఆ లేబర్ కోడ్‌లను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకుంటోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసే ప్రయత్నాలను అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయివరకు ప్రచారం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు బాలసుబ్రమణ్యం, పుల్లయ్య, రామక్రిష్ణ, టి.సుబ్రమణ్యం, ఆర్.లక్ష్మీ, మాధవ్, వేణుగోపాల్, జి.వెంకటేషం, వాణిశ్రీ, బుజ్జి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్



తిరుపతి, జూన్6(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినం శనివారం ఎస్వీయూ ఈద్గా మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఏపీజీబీసీ చైర్మన్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్ అన్నా అనిత తదితర నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు ఆర్థికసాయం



విద్యార్థిని సంజనకు ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

తిరుపతి అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం బీవీపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని సంజన 10వ తరగతి ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచింది. దీంతో ఆమె ఉన్నత చదువుల కోసం తిరుపతికి చెందిన ఐక్యం చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు రూ. 25వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తండ్రిలేని 9ఏళ్ల బాలికకు రూ. 25వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, వైస్ చైర్మన్ రూపేష్, వెంకట్, తులసీరామ్, నరేష్, కృష్ణకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న ఎగ్జిబిషన్



చేపలను తిలకిస్తున్న జనం

తిరుపతి అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీఆర్ రోడ్డులోని ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ నగర ప్రజలకు వేసవి వినోదం పంచుతోంది. ముఖ్యంగా ఈ ఏడాది వినూత్నంగా జలకన్యల ప్రదర్శన వీక్షకులను కనువిందుచేస్తోంది. విశాలమైన ప్రదేశంలో మునుపెన్నడూ లేనివిధంగా 300 అడుగుల మెయిన్‌గేట్‌తో దేశవిదేశాల నుంచి రప్పించిన జలకన్యల విన్యాసాలు మైమరిపిస్తున్నాయి. వివిధ రకాలు చేపలు సందర్శకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. వందకుపైగా స్టాల్స్ మనసు దోచుకుంటున్నాయి. స్కూబా డ్రైవింగ్, చిన్నారుల కార్ రేసింగ్, పలురకాలు ఆటలు ఉత్తేజం నింపుతున్నాయి. అతిపెద్ద జెయింట్ వీల్, గోస్ట్‌హౌస్, కప్ అండ్ సాసర్, బ్రేక్ డ్యాన్స్, జంబో జెట్, డ్రాగన్ ట్రైన్, మినీట్రైన్, కొలంబస్, సెలంబో, హెలికాప్టర్ మేర్రిగ్రైండ్ వంటి 30కిపైగా అబ్బురపరిచే ఎమ్యూజ్‌మెంట్ రైడ్స్ ఆశ్చర్యచకితులను చేస్తున్నాయి. జైపూర్ బ్యాంగిల్స్, హైదరాబాదు డ్రెసెస్, ఇమిటేషన్ జ్యువెలర్స్, మట్టిగాజులు, కోల్‌కతా టాయిస్, సింగపూర్ హ్యాండిక్రాఫ్ట్స్, తిరుపూర్‌కాటన్ డ్రెసెస్, బాంబే ఫ్యాషన్ చప్పల్స్ తదితరాలు యువతను ఆకట్టుకుం టున్నాయి. చూడగానే నూరూరించే పలు రకాల ఆహారపదార్థాలు, సిమ్లా మిర్చి బజ్జీ బేబీచాట్, పాప్‌కార్న్, క్యాండీ, స్వీట్‌కార్న్, మరెన్నో తినుబండారాలతో పాటు కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్ అందుబాటులో ఉన్నాయి.



హనుమంత, గజ వాహనాలపై గోవిందుడు

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు శనివారం ఉదయం హనుమంత, రాత్రి గజ వాహనాలపై గోవిందుడు తిరుమాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కరుణించారు. ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 3గంటలకు వసంతోత్సవం తర్వాత బంగారు తిరుచ్చిపై స్వామివారు మాడవీధుల్లో ఊరేగారు. వాహనం ముందు గో, గోజ, అశ్వాలు వరుసక్రమంలో నడుస్తూ స్వామిపై భక్తిప్రపత్తులను చాటుకున్నాయి. కళాబృందాల ప్రదర్శనలు రంజింపచేశాయి. శనివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపులో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. టీటీడీ జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

స్వామి పిలుపుతోనే తిరుమలకు రాగలం

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): 'మనం అనుకున్నా.. స్వామి పిలిస్తేనే తిరుమలకు రాగలం' అని సినీ నటుడు రాజీవ్ కనకాల అన్నారు. తిరుమల శ్రీవారిని తన సహచరి సుమతో కలిసి శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'స్వామిని దర్శించుకున్న తర్వాత ఎంతో ఆనందంగా ఉంటుంది. అదొక అనిర్వచనీయ అనుభూతి' అని చెప్పారు. సుమ, రాజీవ్‌లతో పలువురు సెల్ఫీలు తీసుకున్నారు. కాగా ఎంపీ బీకే పార్థసారథి, కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.


సుమ, రాజీవ్ కనకాల

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో బాటగంగమ్మ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.88 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,174

తలనీలాలు సమర్పించినవారు: 35,132





ఏపీ పీజీ సెట్‌కు సర్వం సిద్ధం

- 9, 10, 11, 12 తేదీల్లో పరీక్షలు
- ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష షెడ్యూల్ మార్పు
- 17 వర్సిటీల్లోని 25వేల సీట్ల భర్తీ

ఏపీ పీజీసెట్ వివరాలు వెల్లడిస్తున్న సెట్ చైర్మన్ సీహెచ్ అప్పారావు, కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు

తిరుపతి(విద్య), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్ - 2025 నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్టు పీజీసెట్ చైర్మన్, ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు చెప్పారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ సురేంద్ర బాబు తదితరులతో కలిసి శనివారం వీసీ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ విద్యామండలి ఆధ్వర్యంలో పీజీసెట్‌ను ఎస్వీయూ నిర్వహిస్తోందని చెప్పారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు సెట్ కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లు పూర్తి చేశారని పేర్కొన్నారు.

మూడు షిఫ్టుల్లో 30 కేంద్రాల్లో..

జూన్ 9, 10, 11, 12 తేదీల్లో రోజూ మూడు షిఫ్టులుగా పీజీ సెట్ జరగనుంది. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 10.30గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, మూడవ సెషన్ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు జరుగనున్నాయి. మొదటి రోజున 17 సబ్జెక్టులకు, రెండో రోజు 7 సబ్జెక్టులకు, మూడవ రోజున 5 సబ్జెక్టులకు, నాల్గవ రోజున 2 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ తోపాటు మన రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మొత్తం 30 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి.

మేలైన మార్పులు

విద్యార్థుల సౌకర్యార్థం ఈ ఏడాది పీజీ సెట్‌లో కొన్ని మార్పులు చేశారు. పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, టూరిజం, లైఫ్ సైన్సెస్ సబ్జెక్టులను కలిపి ఒకే పరీక్షగా నిర్వహించనున్నారు. ఫలితంగా విద్యార్థులు ఒక్క పరీక్షతో ఏడు సబ్జెక్టుల్లో సీట్లు పొందే అవకాశం ఏర్పడింది. ఇలా ఇప్పుడు మొత్తం 31 సబ్జెక్టుల్లో పరీక్షలు జరుగనున్నాయి.

తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో..

పీజీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులు డిగ్రీలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్య అభ్యసించి ఉంటారు. అందువల్ల రెండు మాధ్యమాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రశ్న పత్రాన్ని ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో సిద్ధం చేశారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషా సంబంధిత సబ్జెక్టులు మాత్రమే ఆయా మాధ్యమాల్లో ఉంటాయి.

తగ్గిన 6 వేల అప్లికేషన్లు

ఏపీలో మొత్తం 17 విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న 143 ప్రోగ్రామ్స్‌కు సంబంధించి సుమారు 25 వేల పీజీ సీట్లు ఉన్నాయి. వీటిలో ప్రవేశాలకుగాను మొత్తం 25,688 మంది విద్యార్థులు ఏపీ పీజీసెట్-2025కు హాజరుకానున్నారు. అయితే గత ఏడాదితో పోల్చితే సెట్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈ దఫా సుమారు 6 వేల మంది తక్కువగా సెట్‌కు హాజరుకానున్నారు.

25వ తేదీలోపు ఫలితాలు

పీజీసెట్ ఫలితాలను ఈనెల 25వ తేదీలోపు ప్రకటిస్తామని చైర్మన్ చెప్పారు. ఫలితాలు విడుదల అయిన వెంటనే ప్రవేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గతంలో లాగానే ఈసారి కూడా కెమికల్ సైన్స్, లైఫ్‌సైన్స్, కంప్యూటర్‌సైన్స్, బోటనీ, జువాలజీ, మేథమేటిక్స్ వంటి సైన్స్ సబ్జెక్టుల్లో పోటీ ఎక్కువగా ఉందని, ఇంగ్లిష్, తెలుగు, హిస్టరీ, కామర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ వంటి సబ్జెక్టుల్లో ఒకమాదిరి పోటీ ఉందని వెల్లడించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష సమయం మార్పు

ఏపీ పీజీ సెట్ షెడ్యూల్‌ను మార్చి 31వ తేదీన వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఐతే ఇటీవల ప్రకటించిన డీఎస్సీ షెడ్యూల్ కారణంగా పీజీసెట్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష సమయంలో మార్పు చోటుచేసుకుంది. 9వ తేదీన పీజీసెట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షతోపాటు డీఎస్సీ పరీక్ష కూడా ఉండటంతో రెండింటికీ హాజరుకానున్న అభ్యర్థులు వర్సిటీ అధికారులకు విన్నపాలు పంపారు. ఆ మేరకు జూన్ 9వ తేదీ ఉదయం నిర్వహించతలపెట్టిన ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షను 10వ తేదీ మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించనున్నారు. ఇదితప్ప పీజీసెట్ షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులూ లేవని సెట్ చైర్మన్ వెల్లడించారు.

సూళ్లూరుపేట కమిషనర్‌పై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యపై శుక్రవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మహేశ్వర్ కేసు నమోదు చేశారు. చిన్నయ్య తండ్రి ఉద్యోగంలో ఉండగానే.. ఆ విషయాన్ని దాచిపెట్టి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందాడని, తప్పుడు సర్టిఫికెట్లను అందజేసి పదోన్నతులు కూడా పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో విచారణ ప్రారంభిస్తామన్నారు.

పుష్కరిణిలో సబ్బులు, షాంపుల బంద్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణిలో పరిశుభ్రతను పరిరక్షించేందుకు టీటీడీ ప్రత్యేక సిబ్బందిని నియమించింది. అత్యంత పవిత్రమైన, పరిశుభ్రమైన శ్రీవారి పుష్కరిణిలో ఇటీవల పరిశుభ్రత లోపించిందని భక్తుల నుంచి టీటీడీకి వరుసగా ఫిర్యాదులు అందాయి. 'పరిశుభ్రతకు నీళ్లొదులుతున్నారు' శీర్షికన ఆంధ్రజ్యోతి ఇటీవల కథనం ప్రచురించింది. ఈక్రమంలో ఉన్నతాధికారులు శ్రీవారి పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా నలుగురు సిబ్బందిని నియమించారు. భక్తులు దుస్తులు ఉతకకుండా, సబ్బులు, షాంపులు వినియోగించకుండా వీరు పర్యవేక్షిస్తారు.


పుష్కరిణి వద్ద విధుల్లో సిబ్బంది

పెద్ద ప్రమాదం..భక్తులు క్షేమం


చెట్టును ఢీకొన్న కారు

తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. హైదరాబాద్‌కు చెందిన కుటుంబం శ్రీవారి దర్శనం ముగించుకుని మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమైన సందర్భంలో 19వ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో నలుగురు భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

అత్యాధునికంగా అలిపిరి చెక్‌పాయింట్

- అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు



తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్ పాయింట్‌ను అత్యాధునిక తనిఖీ కేంద్రంగా తీర్చిదిద్దేలా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. భక్తులు ఎక్కువ సమయం వేచిఉండకుండా వాహనాల తనిఖీ, భక్తుల లగేజి స్కానింగ్ జరిగేలా అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులలో ఉన్న స్కానింగ్ వ్యవస్థను పరిశీలించాలని సూచించారు. టోల్‌ప్లాజాలో తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదిక తయారు చేయాలన్నారు. సమీక్ష అనంతరం అలిపిరి చెక్‌పాయింట్‌లో స్కానర్లను పరిశీలించి అధికారులు, సిబ్బందితో ఈవో మాట్లాడారు.

భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్ల కేంద్రం తనిఖీ

ఇలాఉండగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళికృష్ణ, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులతో కలిసి భూదేవి కాంప్లెక్స్‌లో టోకెన్ల జారీని శనివారం సాయంత్రం ఈవో శ్యామలరావు పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. శ్రీవారిమెట్టుమార్గం ద్వారా వెళ్లే కాలినడక భక్తులకు రోజుకు సరాసరి 5 వేల టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. శ్రీవారిమెట్టుకు సమీపంలోని శ్రీనివాసమంగాపురంలో డీడీ టోకెన్ల జారీకి ఆర్కియాలజీ నుంచి అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.

కల్తీ నెయ్యి కేసులో ధర్మారెడ్డిని విచారించాలి

- జనసేన నేత కిరణ్‌రాయల్



తిరుపతి(జీవకోన), జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో కీలకపాత్రధారి అయిన మాజీ ఇన్‌చార్జి ఈవో ధర్మారెడ్డిని అరెస్టు చేసి విచారించాలని జనసేన నేత కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంవత్సర కాలంగా ఆయన ఎక్కడ ఉన్నారో తెలియదని, వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలని కోరారు. లడ్డూలో కల్తీ పెద్ద పాపమని, డబ్బు కోసం ఇది జరగలేదని, ఒక మతంపై దాడికోసమే చేశారని ఆరోపించారు.భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారికి శిక్ష సరిపోదని.. ఉరితీయాలన్నారు. నెయ్యి లేకుండా నాలుగేళ్ల పాటు లడ్డూలు అమ్మారని, ఈ విషయంలో ఒకరిద్దరు మీడియా సిబ్బంది కూడా సహకరించారన్నారు.టీటీడీలోని అన్ని విభాగాలకూ కీలకంగా వ్యవహరించిన ధర్మారెడ్డిని ఎవరు కాపాడుతున్నారనేది తేలాలన్నారు.అప్పటి పాలకమండలి సభ్యులకు కూడా ఇందులో భాగముందని వ్యాఖ్యానించారు.ఈ దొంగల ముఠాలో ప్రిన్సిపాల్ ఎవరంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ధర్మారెడ్డికి తెలియకుండా ట్యాంకులు పైకి ఎలా వెళతాయని ప్రశ్నించారు.కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా తప్పు చేసిన వారినే శిక్షించాలన్నారు. పర్చేజింగ్ కమిటీ మెంబర్లను కూడా విచారించాలన్నారు. ఈ అంశంపై చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారి లడ్డూ జీఐ హక్కుల ఉల్లంఘనపై సీరియస్

- పలు సంస్థలకు టీటీడీ నోటీసులు

తిరుమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన శ్రీవారి లడ్డూప్రసాదం పేరును అనధికారికంగా వినియోగించుకుంటున్న కొన్ని సంస్థలపై టీటీడీ కొరడా ఝుళిపించింది. జీఐ(జియోగ్రాఫికల్ ఇండికేషన్) హక్కులను ఉల్లంఘిస్తూ స్వామి లడ్డూ పేరుతో తమ ఉత్పత్తులను విక్రయిస్తున్న, ప్రచారం చేస్తున్న సంస్థలపై చట్టపరమైన చర్యలకు పూనుకుంది. ఇప్పటికే కొన్ని సంస్థలకు గత నెల 31న నోటీసులు జారీ చేసింది. 2009లోనే తిరుమల శ్రీవారి లడ్డూకు జీఐ పేటెంట్ లభించిన సంగతి తెలిసిందే. అంతకుముందు పదేళ్ల క్రితం జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ చట్టం ప్రకారం జీఐ హక్కులను సాధించింది. పేటెంట్ హక్కులు, జీఐ పొందిన ఏకైక దేవాలయ ప్రసాదంగా శ్రీవారి లడ్డూ అగ్రస్థానంలో నిలిచింది. ఆన్‌లైన్ ద్వారా, నేరుగా కొన్ని స్వీట్స్ విక్రయ సంస్థలు శ్రీవారి లడ్డూ పేరుతో విక్రయిస్తున్నట్టు టీటీడీ గుర్తించింది. ఈ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశాల మేరకు టీటీడీ లా విభాగం అధికారులు ఢిల్లీకి చెందిన సహదేవ లా చాంబర్స్ ద్వారా పుష్ మై కార్ట్, ట్రాన్సాక్ట్ ఫుడ్స్ లిమిటెడ్, ఇండియా స్వీట్ హౌస్ వంటి ఐదారు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. బయట విక్రయాలతో ఈ ప్రసాదానికి ఉన్న గౌరవాన్ని తగ్గిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఇప్పటికే పుష్ మై కార్ట్ తమ ఉత్పత్తుల జాబితా నుంచి లడ్డూ ప్రసాదం పేరును తొలగిస్తున్నట్టు ప్రకటించింది. మరికొన్ని కూడా తొలగించినట్టు తెలిసింది.

లడ్డూ ప్రసాదం స్వీట్ కాదు : ఈవో

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం. స్వీట్ కాదు. ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ఇది ప్రతీక టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. ఇలాంటి ప్రసాదం పేరును బయట సంస్థలు తప్పుగా వాడితే చర్యలకు వెనకడుగు వేయబోమన్నారు.

భక్తులకు శుభవార్త

- తిరుపతి టూ పూరి ఆర్టీసీ బస్సు ప్రారంభం



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 7(ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంతో పాటు ఒడిశా ప్రజలకు ఇది నిజంగా శుభవార్తే. పూరి జగన్నాథ స్వామి, తిరుమల శ్రీవారి ఆలయాలను సందర్శించాలనుకునే వారికోసం పూరి టూ తిరుపతికి ఒడిశా ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. తిరుపతి, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, బెర్హంపూర్ మీదుగా పూరి(భువనేశ్వర్)కి చేరుకుంటుంది. అక్కడి నుంచి ఇదే మార్గంలో నడుస్తాయి. ఇలా రెండు ప్రభుత్వాలు పరస్పర రహదారి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఏసీ స్లీపర్ 42 సీట్ల సామర్థ్యం, తాజా సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక సదుపాయాలు, ఆకర్షణీయమైన రంగులతో తిరుపతి బస్టాండులో బస్సు సిద్ధంగా ఉంది. పురుషులకు రూ.2,750,స్త్రీలకు 50శాతంతో రూ.1,375గా టిక్కెట్ నిర్ణయించారు. ఈ విధానం ఉభయ రాష్ట్రాల ప్రజలకూ వర్తిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా అడ్వాన్సు బుకింగ్ చేసుకోవచ్చు.

బస్సు ప్రయాణించే రోజులు, వేళలిలా...

- ప్రతి శని, సోమవారాలు ఉదయం 9గంటలకు తిరుపతి బస్టాండు నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు పూరికి చేరుకుంటాయి.
- ప్రతి బుధ, శుక్రవారాలు ఉదయం 9 గంటలకు పూరి నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10గంటలకు తిరుపతికి చేరుకుంటాయి.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు, వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ - ఓపెన్ హౌస్ ఈవెంట్‌కు హాజరైన విద్యార్థులు





ఐఐటీలో ఓపెన్ హౌస్ ఈవెంట్

- ప్రత్యక్షంగా 60.. ఆన్‌లైన్‌లో 120మంది హాజరు

ఏర్పేడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ ఈవెంట్ జరిగింది. ఈ అవగాహన సదస్సులో 60మంది విద్యార్థులు ప్రత్యక్షంగా, 120మంది ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. పరిశోధనలు, కన్సల్టెన్సీ, పరిశోధనలు-పరిశ్రమల సహకారానికి అవకాశాలు, కెరీర్ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్ అవకాశాలపై ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా జీవితంపై స్పష్టతను అందించడం ద్వారా విద్యార్థులు కెరీర్ అభివృద్ధిపై దృష్టి సారించడానికి అవకాశం ఉంటుందని ఈ ఓపెన్ హౌస్ ద్వారా వివరించారు.

కారు డెకార్స్ యజమానిపై వైసీపీ శ్రేణుల దాడి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): కారు డెకార్స్ యజమానిపై వైసీపీకి చెందిన ముగ్గురు యువకులు దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటన శనివారం తిరుపతి చింతలచేను వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన మోహన్‌రావు చింతలచేను రోడ్డులో సీఎస్ఆర్‌కే పేరుతో కారు డెకార్స్ కంపెనీ నడుపుతున్నాడు. తిమ్మినాయుడుపాలెంకు చెందిన వైసీపీ నేత చైతన్యయాదవ్ భాగస్వామిగా ఉన్నాడు. వ్యాపార లావాదేవీలకు సంబంధించి వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. వివాదం ముదరడంతో కంపెనీ షోరూములో ఉన్న మోహన్‌రావుపై చైతన్య యాదవ్, అతని వర్గీయులు మూకుమ్మడిగా దాడి చేశారు. మోహన్‌రావుకు గాయాలయ్యాయి. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లింగేశ్వరనగర్‌లో ఫ్లెక్సీల రగడ

- వైసీపీ సర్పంచ్ అత్యుత్సాహంతో ఫ్లెక్సీలు, టెంట్ల ఏర్పాటు
- టీడీపీ, వైసీపీ నాయకులు మధ్య ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం లింగేశ్వనగర్‌లో సర్పంచ్ అత్యుత్సాహంతో చేసిన ఏర్పాట్లు ఉద్రిక్తతకు దారితీశాయి. టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వివాదానికి కారణమైంది. పోలీసుల కథనం మేరకు....లింగేశ్వరనగర్ సర్పంచ్ కోటేశ్వరరావు(వైసీపీ) పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం గ్రామంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. షామియానా, టెంట్లతో పాటు రోడ్డుకు అడ్డంగా బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టారు. దాదాపు 10 ఇళ్ల చుట్టూ టెంట్లు వేసి రాకపోకలకు దారి లేకుండా చేయడంతో సర్పంచ్ ఇంటి పక్కనే ఉంటున్న హేమలత(టీడీపీ) నిరసించారు. ప్రజలకు అసౌకర్యం కల్గించారంటూ ప్రశ్నించారు. ఈ దశలో ఇరు పక్షాల మధ్య వాదోపవాదోలు తీవ్రస్థాయికి చేరాయి. ఆగ్రహోదగ్రులైన టీడీపీకి చెందిన కొందరు బ్యానర్లు, ఫ్లెక్సీలను చించేశారు. దీంతో వైసీపీ నాయకులు, సర్పంచ్ వర్గీయులు హేమలతతో పాటు అతని కుమారుడుపై చిట్టిరాయులపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ పోలీసులు, బ్లూకోల్ట్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సీఐ చిన్నగోవిందు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఆ సమయంలో వైసీపీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐ డౌన్...డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే సీఐ చిన్నగోవిందు టీడీపీ కార్యకర్తలాగా వ్యవహరించి బ్యానర్లు, ఫ్లెక్సీలు చించి వేశారంటూ వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆయన అనుచరులు విమర్శించారు. స్టేషనుకు వచ్చి సీఐ వ్యవహార శైలిపై డీఎస్పీ ప్రసాద్‌కు పిర్యాదు చేశారు. ఘటనపై విచారించి నివేదిక ఇవ్వాలని సీఐ సునీల్‌కుమార్‌ను డీఎస్పీ ఆదేశించారు.

వేడుకగా తెప్పోత్సవాలు ప్రారంభం

- 10న పద్మావతి అమ్మవారికి గజ వాహన సేవ

తిరుచానూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామి పద్మసరోవరంలో విహరించి భక్తులను అభయమిచ్చారు. ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించాక మధ్యాహ్నం కేటీ మండపంలో శ్రీకృష్ణస్వామికి అభిషేకం జరిగింది. సాయంత్రం ఉత్సవ మూర్తులను పుష్కరిణిలోకి వేంచేసి తెప్పలపై కొలువుదీర్చారు. రాత్రి 7.15గంటలకు వేడుకగా తెప్పోత్సవం ప్రారంభమైంది. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఉభయదేవేరుల సమేత శ్రీకృష్ణసమేత మూడు చుట్లు తిరిగి భక్తులను అనుగ్రహించారు. అనంతరం తిరుమాడ వీదుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి తెప్పలపై ఊరేగి భక్తులకు అభయమివ్వనున్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు అమ్మవారు తెప్పలపై భక్తులకు దర్శనభాగ్యం ఇవ్వనున్నారు. 10న అమ్మవారికి గజ వాహన సేవ, 11న గరుడ వాహన సేవ జరగనుంది. తెప్పోత్సవాల కారణంగా ఆర్జిత సేవలను రద్దు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇన్‌ఛార్జి ఏఈఎస్వో శైలేంద్రబాబు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


పుష్కరిణిలో తెప్పపై ఉభయదేవేరిలతో విహరిస్తున్న శ్రీకృష్ణస్వామి

ట్రంప్ విధానాలపై వ్యతిరేకత

- ఆందోళనలో అమెరికాలోని భారతీయులు
- ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ చలం




మాట్లాడుతున్న చలం, నారాయణ

తిరుపతి, జూన్7(ఆంధ్రజ్యోతి): ట్రంప్ విధానాలతో ఇండియాతో పాటు పలు దేశాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేపీ.చలం అన్నారు. శనివారం సాయంత్రం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో 'ట్రంప్ విధానాలు భారతదేశంలో ప్రభావం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు పెంచడంతో ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఉత్పత్తిరంగం దెబ్బతిని నిరుద్యోగ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఆయుధ వ్యాపారిగా మారిందని విమర్శించారు. అయినా ప్రధాని మోదీ ట్రంప్‌కు దాసోహం అంటున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు కార్యకర్తలు ట్రంప్ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 'కాశ్మీర్ సమస్య-బీజేపీ వైఖరి' అనే అంశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఇటీవల పెహల్గం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలను మోదీ రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలే కానీ అది యుద్ధంతో కాదని పేర్కొన్నారు. యుద్ధంతో సాధారణ పౌరులు చనిపోతారని అందుకే యుద్ధాన్ని వ్యతిరేకించామని వివరించారు. దీనిని బీజేపీ రాజకీయం చేసి సీపీఐపై అభాండాలు వెహిపించన్నారు. అయితే ట్రంప్ యుద్ధాన్ని ఆపాలని చెప్పగానే ఆపివేశారని తెలియజేశారు. టెర్రరిస్టుల, మావోయిస్టుల అంతం కొనసాగుతుందని చెప్పడం కేవలం బీహార్‌లో ఎన్నికల లబ్ధి కోసమేనని విమర్శించారు. ఈ సదస్సుకు సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అధ్యక్షత వహించగా నగర కార్యదర్శి విశ్వనాథ్ వందన సమర్పణ చేశారు.

పుత్తూరు వార్తలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పుత్తూరు అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం స్థానిక ఈద్గామైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలకు అతీతంగా, అన్ని గుణాల కన్నా దానగుణమే ఉన్నతమైనదనిగా బక్రీద్ చాటిచెబుతోందని ముతవల్లీలు బోధించారు. నియోజకవర్గ మైనారిటీ సెల్ టీడీపీ అధ్యక్షుడు రఫీ, అధికార ప్రతినిధి చాను, మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షబ్బర్, హమీద్ బాషా, గేట్ పుత్తూరు మసీదు ముతవల్లి మహమ్మద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతోనే ఎరువుల వినియోగం

వడమాలపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూముల్లో సార పరీక్షలు చేసిన తరువాతే సరైన మోతాదులో ఎరువులు ఉపయోగించాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త సుమంతా కుందూ చెప్పారు. ప్రభుత్వ పథకాల లబ్ధి, పురోగతిపై వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం పాదిరేడు, లక్ష్మమ్మకండ్రిగ, టీసీ అగ్రహారంలలో రైతులకు అవగాహన కల్పించారు. రాస్ కె.వి.కె శాస్త్రవేత్త రామ్‌కుమార్ మాట్లాడుతూ... మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. యాంత్రీకరణతె కూలీల కొరత నివారిస్తూ ఆదాయం పొందువచ్చని చెప్పారు. ఎస్వీ పశువైద్య కళాశాల అధ్యాపకురాలు త్రివేణి, శాస్త్రవేత్త శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు దాముయాదవ్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

యోగ... ఆరోగ్యకరమైన జీవన విధానం



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

పుత్తూరు అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): యోగా కేవలం వ్యాయామం కాదని ఆరోగ్యకరమైన జీవన విధానమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి అన్నారు. శనివారం యోగాంధ్రలో భాగంగా విద్యార్థులతో ఆసనాలు వేయించారు. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. అంతేకాకుండా అనేక రుగ్మతులు తొలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కృష్ణంరాజును అరెస్టు చేయాలి: టీడీపీ

తిరుపతి, జూన్6(ఆంధ్రజ్యోతి): అమరావతిని వేశ్యల రాజధానిగా పేర్కొన్న జర్నలిస్ట్ కృష్ణంరాజును తక్షణం అరెస్టు చేయాలని తిరుపతి నగరపాలక డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఐదేళ్లపాటు మూడు రాజధానుల పేరుతో డ్రామాలాడి రాష్ట్రానికి రాజధాని లేకుండా మాజీ సీఎం జగన్ వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారం కోల్పోయినా అమరావతిపై విషం కక్కుతూనే ఉన్నారని మండిపడ్డారు. సాక్షి ద్వారా అమరావతిపైన, భూములు ఇచ్చిన రైతుల పైన అక్కసు వెళ్లగక్కుతూ దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాజధాని ప్రాంత మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచినందుకు బాధ్యత వహిస్తూ వైఎస్ జగన్ క్షమాపణ చెప్పాలని కోరారు.

భానుడి భగభగ..

నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఎండలు

జూన్ ఆరంభంలోనూ వేడెక్కిన వాతావరణం



షార్ బస్టాండు వద్ద నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

సూళ్లూరుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గడిచిన వారం రోజుల నుంచి ఎండలు రోహిణి కార్తెను గుర్తు చేస్తున్నాయి. సూర్యోదయం నుంచే భానుడు భగభగ మంటున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతతో ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. మే నెలలో రుతుపవనాలు ప్రవేశించడంతో కురిసిన వర్షాలకు చల్లబడిన వాతావరణం జూన్ మొదటి వారంలో ఒక్కసారిగా వేడెక్కింది. సూళ్లూరుపేటలో శనివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజుల నుంచి భానుడు భగభగ మంటుండడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి. రాత్రివేళల్లో కూడా ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది ముందుగానే తొలకరి వానలు పలకరించాయి. అయితే అనూహ్యంగా మళ్లీ ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. అధిక ఉష్ణోగ్రతకు తోడు వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో బయ టకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం 12 గంట లకే పట్టణంలో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. రాత్రి సమయాల్లో కూడా వేడిగాలులు తగ్గడం లేదు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆశాఖ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు. శనివారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు లో, హైవోల్టేజీ సమస్యలు తలెత్త కుండా మెరుగైన విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బిల్లుల బకాయిలను సకాలంలో వసూళ్లు చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించి సోలార్ ప్యానెల్స్ అమర్చుకునేలా వినియోగదారులను ప్రోత్సహించాలని సూచించారు. వ్యవ సాయ కనెక్షన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ నరేంద్రరెడ్డి, డీఈ ప్రసాద్, ఏఈలు ఏడుకొండలు, చిన్నయ్య, నర సింహారెడ్డి, భాస్కర్, విజయకృష్ణ, ఎల్ఐ శీనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే ఎస్ఐ మాలకొండయ్య తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, రైల్లో నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉండవచ్చ న్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

అభివృద్ధి పనులకు రూ.3.71 కోట్లు మంజూరు

గూడూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.3.71 కోట్లు నిధులను మంజూరు చేసిన సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శనివారం పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన పథకం ద్వారా పంచాయతీల్లో వాటర్‌ప్లాంట్లు, అంగన్‌వాడీ పాఠశాలల్లో మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల అభివృద్ధికి, రూరల్ వాటర్ సప్లయ్ పథకం ద్వారా పంచాయతీల్లో బోర్లు వేసేందుకు, పట్టణంలోని కోర్టులో మరుగుదొడ్ల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులకు ఈ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

వేలాడుతున్న మృత్యుపాశాలు

ఆవాసాలపై 11 కేవీ విద్యుత్ తీగలు ● భయం గుప్పిట్లో మూడు గ్రామాల ప్రజలు



చిల్లకూరులో ఇళ్లపై వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు

పెళ్లకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు నుంచి నెలబల్లి వరకు ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉంది. 71 జాతీయ రహదారి పక్కన ఉన్న తాళ్వాయి పాడు, చావాలి, చిల్లకూరు గ్రామాల్లో నివాస గృహాలపైనే విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. ఇళ్ల పైకప్పు పైన మనుషులకు తగిలే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో భయం గుప్పిట్లో బతుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇళ్ల వద్ద కొబ్బరి, మామిడి, వేప చెట్లకు విద్యుత్ తీగలు తగులుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ విష యాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ట్రాన్స్‌కో ఏఈ సురేష్‌బాబు స్పందిస్తూ దిగువచావాలి, తాళ్వాయిపాడు, చిల్లకూరు గ్రామాల్లో ఇళ్లను పరిశీలించి ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.





గూడూరులో నమాజ్‌కట్ట వద్ద, నాయుడుపేటలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక బక్రీద్

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక బక్రీద్ అని ముస్లిం మతపెద్దలు అన్నారు. శనివారం బక్రీద్ సందర్భగా పట్టణంలోని నమాజ్ కట్ట, జామియా మసీదు, దర్గాలు, మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ లోని బోధనలను వినిపించారు. అలాగే మండలంలోని చెన్నూరు, విందూరు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ నియోజకవర్గంలోని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

చిల్లకూరు: మండలంలోని చిల్లకూరు, పారిచెర్లవారిపాళెం, తొణు మాల, ఉడతావారిపాళెం, ఏరూరు, మోమిడి తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఓజిలి: మండలంలోని ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఓజిలితో పాటు కురుగొండ, రాచపాళెం, ఆరిమేనిపాడు, కార్జిమేడు, అత్తివరం, కరబల్లవోలు తదితర గ్రామాల్లోని మసఅదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తడ: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పూడికుప్పం వద్ద ఉన్న మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం నాయకులు హుస్సేన్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండలంలో ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మన్నారుపోలూరులో ఈద్ నమాజు చేశారు.

నాయుడుపేట టౌన్: పట్టణంతో పాటు మండలంలోని మసీదుల్లో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు, నూర్‌మసీద్, మక్కా మసీదు, అమీర్‌షావలి మసీదుల్లో ప్రార్థనలు చేశారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని జామియ మసీదు, బొమ్మిడి కాలువ లోని అక్త మసీదు, మాసాపేటలోని ఉమ్మర్ మసీదు, తూర్పువీధిలోని రెహ్మానీయ మసీదు, ఒంటెలవీధిలోని బిలాన్ మసీదు, ప్యాలెస్ సెంటర్‌లో హిమాం మసీదుల్లో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు.

కోట: మండలంలోని కోట, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం, పుచ్చలపల్లి మసీదుల్లో ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు చేశారు. శ్యామసుందరపురంలోని జామియా మసీదులో ఇమాంలు ఖురాన్ విశిష్టతను వివరించారు. రవినగర్‌లో గ్రీన్ ఫౌండేషన్ ప్రతినిధి షేక్ జలీల్ అహ్మద్ పేద ముస్లిం కుటుంబాలకు మాంసం పంపిణీ చేశారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రకృతికుమార్

వెంకటగిరి టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెగుంలో గిరిజన కుటుంబాలకు స్వామి వివేకానంద యువ సైన్యం వ్యవస్థాపకుడు, ఏపీపీ ప్రకృతికుమార్ శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగవాన్ సురేష్ మహరాజ్, స్వామి వివేకానందా యువసైన్యం సభ్యులు గోపీనాథ్, రాంప్రసాద్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు



గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజా వీధిలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేనారాధనం, పుణ్యాహవచనం, నిత్య హోమం పూజలు జరిపి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హంస వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ ఛైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ పాల్గొన్నారు.

విద్యానగర్‌లో ఇంటర్వ్యూలు



నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ కొత్తపాళెం రోడ్డులో ఉన్న శ్రీనివాస రైసు మిల్లులో శనివారం ఉద్యోగ నియామకాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. అన్‌డిన్‌సోడగల్ సంస్థ ఆధ్వర్యంలో చెన్నైకు చెందిన ఐమెక్యూ సొల్యూషన్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఆ కంపెనీ హెచ్‌ఆర్‌లు పూజ, సాయికుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన 30 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి భూపతి మోహన్‌సాయి, సురేంద్రరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బాలసుబ్రహ్మణ్యం, పోలయ్య, మల్లికార్జున్, హేమంత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్)జూన్7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కందారపు మురళి, ప్రసాదరావు పిలుపునిచ్చారు. తిరుపతి సీఐటీయూ కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కార్పొరేటర్లకు అనుకూలంగా మార్పులు చేసిందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ సమ్మె చేపట్టనున్నాయని వివరించారు. ఆ లేబర్ కోడ్‌లను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకుంటోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసే ప్రయత్నాలను అన్ని జిల్లాల్లో గ్రామ స్థాయివరకు ప్రచారం చేస్తామని చెప్పారు.

24న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

వెంకటగిరి టౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతులకు ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తులసిజ్యోతి తెలిపారు. విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25న ఫలితాలు ప్రకటించి, 26న అడ్మిషన్లు ఇస్తామన్నారు.

జనసేన బలోపేతానికి కృషి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండ లంలోని కాండ్ర గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అధిష్టానం గుర్తింపునిస్తుందన్నారు. పవన్‌కల్యాణ్ ఆశయా లను గ్రామస్థాయిలోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జగదీష్, నవీన్‌రాజు, దిలీప్, కిరణ్, మోహన్, కృష్ణ చరణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కోటంబేడులో సంకల్ప అభియాన్



కోటంబేడులో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయశ్రీ

బాలయపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటంబేడు పంచాయతీ పరిధిలో గల పలు గ్రామాల్లో శనివారం వెంకటగిరి మండలం పెరియవరం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వికసిక కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త విజయశ్రీ మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు సంబంధించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సమతుల ఎరువుల వాడకం, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం, సాగు ఖర్చు తగ్గించి సుస్థిర ఆదాయం పొందడంపై అవగాహన కల్పించారు.

రక్తదానం

గూడూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయంలో శనివారం ఎస్‌బీఐ స్టాఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీగా పనిచేసిన తారకనాధ్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, జూన్ 7 (ఆంధ్ర జ్యోతి): నాయుడుపేట - నరసారెడ్డి కండ్రిగ జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి మణి (25) అనే యువకుడు మృతి చెందాడు. చిట్ట మూరు మండలం గునపాడు గ్రామానికి చెందిన మణి పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేసేవాడు. శనివారం సాయంత్రం దుకాణంలో పనులు ముగించుకొని మోటారు సైకిల్‌పై స్వగ్రామమైన గున పాడుకు బయలుదేరాడు. నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి సమీపంలో వెళ్తుండగా మోటారు సైకిల్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మణి అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

9, 12 తేదీల్లో రైళ్ల రద్దు

తడ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ - గూడూరు సెక్షన్ కవర పేట - గుమ్మిడిపూండి మార్గంలో మరమ్మతుల కారణంగా ఈ నెల 9, 12 తేదీల్లో పలు రైల్లు రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్ - గుమ్మిడిపూండి, చెన్నై బీచ్ - గుమ్మిడిపూండి, చెన్నై సెంట్రల్ - సూళ్లూరు పేట, సూళ్లూరుపేట - నెల్లూరు, నెల్లూరు - సూళ్లూరుపేట మధ్య 9, 12 తేదీల్లో ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 3.20 గంటల వరకు పలు సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

రద్దు చేసిన రైళ్ల వివరాలు....

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037.
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.45 నిమిషాలకు వచ్చే మెమూ రైలు నెంబరు 66038.
- చెన్నై నుంచి సూళ్లూరుపేట ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు బయలుదేరే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.40, 10.30, 11.35, 12.40లకు బయలుదేరి వచ్చే ఈఎంయూ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 10.55 మధ్యాహ్నం 1.05 గంటలకు, 2.30, 3.15 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు రద్దు అయ్యాయి. మరికొన్ని రైళ్లు పాక్షికంగా రద్దు చేశారు.

క్రీడలను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే సహకారం



ఎంఈవో రవూఫ్‌కు స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారం అందిస్తున్నారని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని పలు పాఠశాలలకు ఎమ్మెల్యే దాతృత్వంతో క్రీడా పరికారాలను ఎంఈవో రవూఫ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే తన సొంతనిధుల ద్వారా క్రీడా పరికరాలను 15 పాఠశాలలకు అందజేశారన్నారు. అదేవిధంగా స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నూతనంగా గ్యాలరీ, ఓపెన్ జిమ్, ప్రహరీ నిర్మాణాలకు ఎమ్మెల్యే సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో సుమన్, లవకుమార్, శర్మ, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటరమణ, బ్రంద, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించండి



ఎంఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల నాయకుల నిరసన

గూడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో ఉపాధ్యాయ సంఘాలు నేతలు విద్యాశాఖ అధికారులతో జరిపిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం వెబ్ ఆప్షన్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించడం సరికాదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని, లేకుంటే డీఈవో కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో రవిచంద్ర, మురళీసింగ్, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ వద్దు

డక్కిలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు వెబ్ కౌన్సిలింగ్ కాకుండా సాధారణ కౌన్సెలింగ్ నిర్వహించాలని మహాజన టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చేమూరు మస్తాన్, కార్యదర్శి దూడల పెంచలయ్య అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ విస్మరించి వెబ్ కౌన్సెలింగ్ చేపడతామని చెప్పడం సరికాదన్నారు. అలేగా పదోన్నతుల రిజర్వేషన్లలో ఎస్సీ వర్గీకరణ సక్రమంగా అమలు పరచడం లేదని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల్లో 200 మందికి పైగా మాదిగ ఉద్యోగులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

తిరుపతి(క్రీడలు), జూన్ 7(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సీడీసీఏ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్ అన్నారు. ఫ్రెండ్లీ ఫైటర్స్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించి సమ్మర్ కోచింగ్ క్యాంపు శనివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చిన్నవయస్సులోనే క్రికెట్‌లో రాణిస్తే అండర్-12 నుంచే రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహించే అకాశం లభిస్తుందన్నారు. అలాగే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ప్రముఖ గ్యాస్ట్రాలజిస్ట్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులకు మంచి పౌష్టికాహారం, తగిన వ్యాయామం అవసరమన్నారు. కాగా సమ్మర్ క్యాంపులో 150మంది క్రికెట్ శిక్షణ తీసుకున్నారు. పది జట్లుగా ఏర్పాటుచేసి ఒక టోర్నీ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లలో సెంచరీ చేసిన, 6వికెట్లు తీసి ప్రతిభచాటిన క్రీడాకారులున్నారు. అతిథులచే సర్టిఫికెట్స్, మెడల్స్, ట్రోఫీలను అందజేశారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరి పారు. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



వరలక్ష్మి శరత్‌కుమార్ దంపతులు

శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శనివారం ప్రముఖ సినీ నటి వరలక్ష్మి శరత్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. బీజేపీ నాయకుడు చందురాయల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు కన్నలి ప్రతాప్‌రెడ్డి, దుర్గాప్రసాద్, బాలాజీ, సాయి తదితరులు పాల్గొన్నారు. వాయులింగేశ్వరుడిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన తేజ్ గణేష్ కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు దర్శన ఏర్పాట్లు చేశారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండల సముదాయంలో ఎట్టకేలకు శనివారం తహసీల్దార్ శ్రీదేవి ఆదేశాలతో సిబ్బంది, పోలీసులు తొలగించారు. రెండు నెలల క్రితం కనమనంబేడు గ్రామానికి చెందిన దళితులు ఇంటి స్థలాల కోసం మండల సముదాయంలోని సర్వే నెం.251, 252, 253లోని ప్రభుత్వం భూమిని ఆక్రమించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట 42 రోజులు పాటు దీక్షలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆదిమూలం అర్హులకు స్థలాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. అనంతరం దళితులు తాము ఆక్రమించుకున్న భూమికి హద్దు రాళ్లను పాతుకున్నారు. శనివారం పక్కా ఇంటి నిర్మాణాల కోసం సామగ్రి దించుకోవడాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో తహసీల్దార్ శ్రీదేవి సిబ్బంది, పోలీసులతో సంఘటనా స్థలానికి వెళ్లి ఎక్స్‌కవేటర్ సాయంతో ఆక్రమణలు తొలగించారు. ప్రభుత్వ భూముల్లో ఎవరైన ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.డీటీ చంద్రబాబు నాయుడు, ఆర్ఐ నల్లయ్య, వీర్వోలు బాల మురళి, జగదీష్, ఈశ్వరయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల హామీని నిలబెట్టుకోవాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. తొట్టంబేడు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద వారు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో ఉపాధ్యాయ సంఘాలు పలు సమస్యల పరిష్కారం కోసం రెండు విడతల్లో చర్చించాయన్నారు. ఈ చర్చల్లో ఎస్‌జీటీ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కానీ మొన్నటి నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్ల వెబ్ కౌన్సెలింగ్ జరిగే విధానం ప్రభుత్వం ఎమ్మార్సీల ద్వారా టీచర్లకు స్క్రోల్ చేస్తూ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామనే ధోరణిని ప్రదర్శిస్తోందన్నారు. వెబ్ కౌన్సిలింగ్‌లో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని డిమాండ్ చేశారు. మురళీకృష్ణ, శ్రీనివాసులు, మోహన్‌బాబు, దేవేంద్ర, సుబ్రహ్మణ్యంరెడ్డి, శివ, రామదాసు, సుబ్బయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యవేడు మాజీ ఎమ్మెల్యే జయంతి

వరదయ్యపాళెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి):సత్యవేడు మాజీ ఎమ్మెల్యే, తిరుపతి మాజీ ఎంపీ, మాజీ మంత్రి సి.దాస్ 104వ జయంతి వేడుకలను డీవీఎంసీ సభ్యుడు గుత్తిత్యాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా వరదయ్యపాళెం సర్పంచ్ జ్యోతి, మాజీ సర్పంచ్ చిన్న హాజరై మొక్కలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సి.దాస్ మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి జన్మదిన శుభాకాంక్షలు

కేవీబీపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ కేవీబీపురం మండల అధ్యక్షుడు బాబుయాదవ్ పార్టీ కార్యాలయంలో ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి వెంటకకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

త్యాగ నిరతికి బక్రీద్ నిదర్శనం



ఈదులగుంట ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్



శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగ నిరతికి బక్రీద్ నిదర్శనమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని పట్టణంలోని ఈదులగుంట ఈద్గాకు ముస్లిం మతపెద్దల ఆహ్వానం మేరకు ఆయన విచ్చేశారు. ముస్లింతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. దువాను స్వీకరించి ఈద్‌ముబారక్ తెలిపారు. బక్రీద్‌లో భాగమైన ఖుర్బానీని దానంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాగద్వేషాలకు అతీతంగా మైనార్టీలందరూ భక్తి శ్రద్ధలతో బక్రీద్‌ను జరుపుకుంటారన్నారు. ప్రతి ఒక్కరూ దాన, సేవా గుణాలను అలవర్చు కోవాలని పిలుపునిచ్చారు. మతపెద్దలకు బీఎస్ అక్రం, ముక్తి, నయీమ్, గవర్నమెంట్ ఖాజీ మున్నాబాయ్, టీడీపీ మైనార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ, మునిరాజాయాదవ్, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): తమకు ఉన్న దాంట్లో నుంచి ఇతరులకు పంచి పెట్టాలన్న ధాతృత్వ స్ఫూర్తిని బక్రీద్ తెలియజేస్తుందని సత్యవేడు మసీదు ఇమాం షకీల్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బక్రీద్‌ను శనివారం సత్యవేడు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దాసుకుప్పం, శిరుణంబూదూరు, ఏఎంపురంలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాజంలో దురాచారాలను రూపుమాపి, బలహీన వర్గాల అణచివేతను వ్యతిరేకించి, పేదల కోసం జీవితాన్ని త్యాగం చేసిన హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా బక్రీద్ పండుగ నిర్వహించుకుంటారని తెలిపారు. ముత్తవల్లీ సుల్తాన్ బాయ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని ముతవల్లీ లాలాసాహెబ్ అన్నారు. పాపానాయుడుపేటలోని జామియా మసీదులో బక్రీద్‌ను పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీవ్‌నగర్, ముస్లింపాళెం ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు బక్రీద్ విశిష్టతను వివరించారు. పేదలకు దానం చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు, బుచ్చినాయుడుకండ్రిగ, నీర్పాకోట, వెస్ట్‌వరత్తూరు, గాజులపెళ్లూరు ల్లో బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీపీకోట, నాగలాపురంలలో బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. మత గురువులు పవిత్ర ఖురాన్ సూక్తులను పఠించి, బక్రీద్ పండుగ ఔనత్యాన్ని, విశిష్టతను తెలియజేశారు. మానవులు పరస్పరం త్యాగ నిరతి, సేవా భావంతో మెలగాలన్నదే బక్రీద్ పండుగ పరమార్థమని తెలియజేశారు.

రేణిగుంట(ఆంధ్రజ్యోతి): ప్రతి ముస్లిం ఉన్నదాంట్లో పదిమందికి దానం చేసి అల్లా మార్గంలో ముతవల్లీలు బోధించారు. బక్రీద్ సందర్భంగా ప్రత్యే ప్రార్థనలు నిర్వహించారు.

దుర్గిపేరి వద్ద ఎదురెదురుగా కార్ల ఢీ



ఏర్పేడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరి వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏర్పేడు నుంచి వెంకటగిరివైపు వెళుతున్న కారులో ప్రయాణిస్తున్న రాపూరు మండలం అక్కమాంబపురానికి చెందిన రాగమ్మ, లక్ష్మమ్మ, రాఘవయ్య గాయపడ్డారు. అదే విధంగా వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపు వెళుతున్న కారుతో ప్రయాణిస్తున్న హాస్య తలకు గాయమైంది. వారిని 108 అంబులెన్స్‌లో వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

మహిళలకు జగన్ క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న నివేదిత మోరె

శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల కలల రాజధాని, ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనుల వేగం పుంజుకోవడం జీర్ణించుకోలేని సాక్షి చానల్ తన చర్చా వేదికలో మహిళలను కించ పరిచేవిధంగా వక్తలు వాఖ్యలు చేశారని, దానికి మాజీ సీఎం జగన్ అమరావతి మహిళలకు క్షమాపణలు చెప్పాలని మాజీ కౌన్సిలర్ నివేదిత మోరె డిమాండ్ చేశారు. సాక్షి చానల్‌లో ఏ చర్చా కార్యక్రమం అయినా జగన్ డైరెక్షన్‌లోనే సాగుతుందన్నారు. శనివారం జరిగిన చర్చావేదికలో అమరావతిని కించపరుస్తూ ఆ ప్రాంత మహిళల శీలహననం చేయించిన జగన్‌ని సంఘం నుంచి బహిష్కరించాలన్నారు. సాక్షి మీడియాలో మాట్లాడిన వారిపై మహిళా కమిషన్, ఎస్సీ, ఎస్టీ కేసు, మానవ హక్కుల కమిషన్, క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉమేష్‌రావు, మిన్నల రవి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



రేణిగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక రవాణాను గ్రామస్తులతో కలిసి జన సైనికులు అడ్డుకున్నారు. శనివారం గాజులమండ్యం హరిజనవాడ సమీపంలో స్వర్ణముఖి నది తీరాన ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతుండగా జనసేన నాయకులు గ్రామస్తులతో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ... స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతాల్లో ఇసుకను అధిక మొత్తంలో తోడేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. ఇప్పటికైనా ఇసుక స్మగ్లర్లపై దృష్టి కేంద్రీకరించి చట్టపరమైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 'ప్రైవేటు' ప్రతిభ

శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో రాయలసీమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎంపీసీలో వంశిక, దివ్య (464) మార్కులు, దొనిక ప్రియ, విష్ణుప్రియ (462) సాధించారు. సీఈసీలో నిషాత్ అమీన (487), బైపీసీలో ప్రియ (429) సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి అభినందించారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి మోదీ పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జిల్లాస్థాయి సమావేశం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కోలా ఆనంద్, మునిసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ... 11 సంవత్సరాలుగా మోదీ సుపరిపాలన, సేవ, అభివృద్ధి, వికసిత భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామన్నారు. కండ్రిగ ఉమ, కోటేశ్వరరావు, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అలుగు నిలుపు



అలుగు కుండ ఊరేగింపు

ఏర్పేడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురం లో ద్రౌపది సమేత ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం అలుగు నిలుపు కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకుల భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలీసుల సంయుక్త తనిఖీలు



రేణిగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపిన వివరాలు... గుంతకల్లు ఎ స్పీ ఆదేశాలతో గంజాయి రవాణాను నియంత్రించడంతో భాగంగా రైల్వే స్టేషన్‌లోని బుకింగ్, పార్సిల్ ఆఫీస్, ప్లాట్‌ఫాం, రైలు బోగీల్లో పోలీసులు జాగిలాలతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు.

సీడీపీవోగా కృష్ణవేణి

రేణిగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా కె.కృష్ణవేణి శనివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కృష్ణమంజరి నాయుడుపేటకు బదిలీ కావడంతో నగరిలో విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి రేణిగుంటకు బదిలీ అయ్యారు. ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఏర్పేడు, రేణిగుంట మండలాల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపడతామని కృష్ణవేణి తెలిపారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వర స్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆగ్నేయ గణపతి బాలాలయం



శ్రీకాళహస్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా మూడో మాడవీధిలో కొలువై ఉన్న ఆగ్నేయ గణపతి స్వామికి శనివారం బాలాలయ అంకురార్పణ పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ స్థాపన చేశారు. అంకురార్పణ, విశేష పూజల అనంతరం పూర్ణాహుతిని నిర్వహించారు.

వెలుగు సీసీ మృతి



పరశురాం (ఫైల్‌ఫొటో)

కేవీబీపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమయ్య కండ్రిగకు చెందిన వెలుగు సీసీ పరశురాం(51) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పరశురాం కేవీబీపురం వెలుగు కార్యాలయంలో పది సంవత్సరాలుగా సీసీగా పనిచేశాడు. అనంతరం విజయపురం మండలానికి బదిలీపై వెళ్లాడు. శుక్రవారం అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వేలూరు సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ మరణించాడు.

విద్యార్థినులకు ఆర్థికసాయం

తిరుపతి అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం బీవీపురం జడ్పీహైస్కూల్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని సంజన టెన్త్ ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచింది. దీంతో తిరుపతికి చెందిన ఐక్యం చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు రూ. 25వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, వైస్ చైర్మన్ రూపేష్, వెంకట్, తులసీరామ్, నరేష్, కృష్ణకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.